


## నా మాట

2023వ సంవత్సరంలో స్వాతంత్ర్య భారతదేశంలో బ్రతుకుతున్న అదృష్టవంతులం మనం. భారతదేశం, భారతీయ సమాజం అన్ని రంగాల్లో ఎంతో ప్రగతిని సాధించిన తరువాత పుట్టిన మనం, ఎన్నో రకాలుగా మన ముందు తరాల కంటే అదృష్టవంతులం. ముఖ్యంగా మనకు పరాయి పాలనలో బ్రతికినప్పటి భారతీయుల రాజకీయ, సామాజిక పరిస్థితుల గురించి అవగాహన లేదు. అలాగే, ఆనాటి మహిళల జీవితం గురించి కూడా! ఈ అంశాల గురించి సమగ్రమైన నవల వెలువడిందో, లేదో నాకు తెలియదు. అయితే నేను రాసిన ఈ నవలలో ఆ రెండు రంగాలు స్పృశించబడ్డాయి. కథాగమనానికి అవసరమైనంత వరకే వాటిని ప్రస్తావిస్తూ ముందుకి వెళ్ళాను. కారణం పాఠకులకు నవల చదివే ఆసక్తిని దూరం చేయకూడదనే!

ఈ నవల రాయటానికి 2020 ఏప్రిల్ 25న గతించిన, శ్రీ మంచాళ సీతారామారావుగారి భార్య,, మా తల్లి శ్రీమతి స్వరాజ్యలక్ష్మి గారు ప్రేరణ.

90 సంవత్సరాల నిండు జీవిత కాలంలో ఆవిడ అప్పుడప్పుడు ఆవిడ చిన్ననాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల గురించి మాతో పంచుకున్న జ్ఞాపకాల పరిమళంతో ఈ నవలా సుమం వికసించింది. ఇందులో పాత్రలన్నీ పూర్తిగా కల్పితాలు. జీవించి ఉన్న లేదా మరణించిన ఏ వ్యక్తి తో నైనా ఎవరికైనా పోలికలు కనిపిస్తే అది కేవలం కాకతాళీయకం మాత్రమే. వాస్తవికంగా కనిపించే రచన చేయటం కోసం కొందరు గొప్ప దేశ నాయకుల పేర్లను వాడటం జరిగింది. అది ఈ తరం వాళ్లకు వారి గొప్పదనాన్ని తెలియజేయటానికి మాత్రమే!

ఈ నవల చదివి, జీవితాన్ని ఫలవంతం చేసుకున్న ఓ మహిళా మూర్తి నుంచి, ఏ ఒక్కరైనా స్ఫూర్తి పొందితే దీని ప్రయోజనం సిద్ధించినట్లే. ఆమె గుణగణాలలో సగమైనా పుణికి పుచ్చుకున్న 'మహిళా రత్న'లు నిజంగా ఎక్కడైనా ఉంటే వారికి నా పాదాభివందనం. వారి జీవితమే ఈ "భారతీయం."

ఈ నవలా రచనకు నాతో పాటు, నేను పడినంత కష్టాన్నీ పడి ప్రోత్సహించిన నా కుటుంబ సభ్యులకు, మిత్రులకు కృతజ్ఞతలు చెప్పుకోకపోతే, ఈ నవలను నేను రచించానని చెప్పుకునే
సాహసం నేను చెయ్యలేను.

ఇది నా తల్లిదండ్రులు మంచాళ స్వరాజ్యలక్ష్మి, మంచాళ సీతారామారావు గార్ల దివ్య స్మృతికి చిన్న కూతురు 'చిన్నా' భక్తి ప్రేమలతో ఇచ్చిన పుస్తక నీరాజనం.

# (గత సంచిక తరువాయి)

## 28

**భా**రతి చేత మెత్తని, పాలనురుగు లాంటి చీర కట్టించి, వంకీ పూల జడ వేశారు. ముఖాన కళ్యాణం బొట్టు, బుగ్గన చుక్క పెట్టి, పాదాలకు మళ్ళా పారాణి తీర్చి దిద్దారు.

"అనవసరంగా నగలు ఎక్కువ పెట్టకండి. రవి ఇబ్బంది పడతాడు."అన్నది సరళ నవ్వుతూ. అందరూ ఘొల్లున నవ్వారు.

"ఆ, మన భారతి సహాయం చేస్తుందిలే, అబ్బాయి ఇబ్బంది పడకుండా." వరసకి మేనత్త సరస మాడింది. భారతి చెంపలు చేతికి పెట్టిన గోరింటాకు పండిన ఎరుపు కంటే ఎఱ్ఱ నయ్యాయి

"వాళ్ళ తిప్పలేవో వాళ్ళు పడతారులే కానీ, ముందు మీరు దాన్ని గదిలోకి పోనివ్వండి" అన్నది శారద భారతి బుగ్గలు పుణికి మెటికలు విరుస్తూ. అందరూ కలిసి భారతిని అలంకరింపబడిన గది గుమ్మం దాకా తీసుకుపోయి లోపలికి నెట్టి తలుపులు వేశారు పకపకా నవ్వుతూ.

"రేపు పొద్దున్న వివరాలు చెప్పాలమ్మోయ్! మొగ్గలా పంపుతున్నాము, పువ్వులా విరియాలి. మాకు నీమీద ఎటువంటి ఫిర్యాదులూ రాకూడదు." మూసిన తలుపుల అవతల నించి ఓ ముదిత గట్టిగా అంది. నిజంగానే సిగ్గుల మొగ్గయింది భారతి. ఎంత ప్రయత్నించినా తల ఎత్తలేక పోయింది, అడుగు ముందుకు పడలేదు. కిటికీ లోంచి వెన్నెల వెదజల్లుతున్న చందమామను, అతని చుట్టూ చేరిన నక్షత్రాలను చూస్తున్నాడు రవి. తలుపులు మూసి అందరూ వెళ్ళిపోగానే భారతి వంక తిరిగాడు.

కుప్ప పోసిన అందంలా అక్కడుంది భారతి. ఒక్క క్షణం అతనికి ఆమె అందానికి కళ్ళు మిరుమిట్లు గొల్పాయి. ‘ఇదేమిటీ, భారతి ఇంత అందంగా ఉంటుందని ఎప్పుడూ అనుకోలేదు’ అని ఆశ్చర్య పోయాడు. ‘దీనికి ఇంత సిగ్గు ఎక్కడనించి వచ్చిందబ్బా? ఎన్నిసార్లు తన భుజాల మీద ఎక్కి ఉప్పుమూటలా మొయ్యమని గొడవ పెట్టలేదు?’ అతని పెదవుల మీద చిలిపి నవ్వు మెరిసింది.

భారతి దగ్గరకు వెళ్ళి ఆమె చేతిలోని పాలగ్లాసును తీసుకుని అక్కడున్న బల్ల మీద పెట్టేశాడు. వెనక్కి తిరిగి ఆమెను ఉప్పెక్కించుకునేందుకు సిద్ధంగా నిల్చున్నాడు నవ్వుతూ. భారతి కళ్ళు పెద్దవయ్యాయి. చిరునవ్వుతో చిన్నగా ఎగిరి అతని వీపెక్కింది. ఆమెను తెచ్చి మంచం మీద దింపాడు రవి. ఇద్దరూ నవ్వుకున్నారు మనస్ఫూర్తిగా. ఒకరి కౌగిలిలో ఒకరు ఒదిగి పోయారు. ఒకరిలో ఒకరు కలిసి పోయారు. ఇద్దరికీ ఒకరికి ఇంకొకరు వారిలో భాగమనే భావం మనసారా కలిగింది. అంతవరకు ఉన్న కొత్తదనం పోయి ఏదో తెలియని అధికారం ఒకరి మీద ఒకరికి సంక్రమించినట్లు అనిపించింది. అలసి సొలసిన వారు అలాగే నిద్రకి వశులయ్యారు. కళ్ళు మూసుకున్న భారతి ఉలిక్కి పడి లేచింది పావు గంటన్నా కాకుండానే.

"రవి మావయ్యా, నీతో మాట్లాడాలి. మనం మాట్లాడుకుందాం అనుకున్నాంగా" అంది నిద్రతో మూసుకుపోతున్న కళ్ళను బలవంతాన తెరుస్తూ

"కాసేపు పడుకోవే బంగారం, మాట్లాడుదువుగాన్లే అలిసి పోయావు." లేచి కూర్చుని ఆమె కాళ్ళను తన వొళ్ళో పెట్టుకుని పిక్కలను, పాదాలను నెమ్మదిగా పిసుకుతూ అన్నాడు రవి.

"ఇలా నువ్వు పాదసేవ చేస్తుంటే పడుకుంటే, ఇంకేంటి లేచేది? ఇప్పుడే మాట్లాడుకుందాం రవి మావయ్యా." అంది భారతి. కానీ భారతి మనసు రవి మీద నమ్మకంతో అప్పటికే నిండిపోయింది. అతను తనతో మాట్లాడిన తీరు, ప్రవర్తించిన తీరు, చూపించే ప్రేమ అప్పటి వరకు అతనిలో ఆమెకు తెలియని మరో కోణాన్ని ఆవిష్కరించాయి. అది కేవలం భార్యలకు మాత్రమే భర్తలలో అర్థమయ్యే కోణం. ఆమె వివేకవంతమైన బుద్ధి ఈ మనిషిని నమ్మొచ్చు అని గట్టిగా చెప్తోంది.

అందుకేనేమో, "కాసేపు పడుకుని లేచాక నువ్వు చెప్పినదేదైనా వింటాను. కళ్ళు మూసుకుపోతున్నాయి, పడుకోవే "అని అతననగానే ఏ భయాలు, అనుమానాలు లేకుండా అతని కౌగిలిలో చేరి హాయిగా నిద్ర పోయింది.ఆమెను అపురూపంగా హత్తుకుని తనూ నిద్ర పోయాడు రవి.

తెల్లవారీ తెల్లవారకుండానే తలుపు చప్పుడయింది. ఆదమరచి నిద్రపోతున్న భారతి గబుక్కున లేచింది. చుట్టూ సంకెల లేసిన రవి చేతులను ఇష్టంగా చూస్తూ, నెమ్మదిగా విడిపించుకుంది. తన మువ్వల చప్పుడుతో అతనికి మెలకువ రాకుండా తేలికగా అడుగులు వేస్తూ గుమ్మం దగ్గిరకి చేరింది. చిన్నగా తలుపులు తీస్తూ, వాకిట్లో ఉన్న ముత్తైదువులు నోరు తెరిచేలోగా వారి తలలపై నుండీ బయటకు చూస్తూ

"ఆమ్మో కర్రి ఆవు కట్టు విడిపించుకుంది "అంటూ దొడ్లోకి పరిగెత్తింది.

"ఏదీ ఏదీ" అంటూ అందరూ కంగారు పడి చూస్తుండగా, సరళ చేతుల్లోంచీ తను మార్చుకోవటానికి తెచ్చిన బట్టలను గుంజుకుని స్నానాలగదిలోకి మెరుపులా మాయమైంది భారతి. ఆమెను చుట్టుముట్టి, ఏడిపించి, తొలి అనుభవం గురించి కొసరి కొసరి అడిగి, ఆనక నలుగు బెట్టి స్నానం చేయిస్తూ సరసా లాడాలనుకున్న అమ్మలక్కల ఆశలన్నీ అడియాసలయ్యాయి.

సరళ గట్టిగా నవ్వుతూ "దొరికి పోవటానికి భారతి నాలా తెలివి తక్కువదా?" అంది మురిపెంగా.

ఈ సరస సన్నివేశాన్ని చూస్తున్న రాజేశ్వరి మోము మ్లానమయ్యింది, ఆమె కివన్నీ అనుభవం కాక పోవడం నుంచి ఏమో!!

## 29

రాజేశ్వరిని తమ ఇంట్లో దింపి పార్వతీశం కుటుంబం వెళ్ళిపోగానే అలిమేలుకి ఏం చెయ్యాలో, కోడలు పిల్లతో అసలు ఏం మాట్లాడాలో ఏమీ అర్థం కాలేదు. కానీ ఆ అమ్మాయి కోరి తన ఇంటికి వచ్చిన వరలక్ష్మీ దేవతలాగా కనిపించింది. మూలనున్న చాప పరిచి "దామ్మా, ఇలా కూకో " అంది మర్యాదగా. కూర్చుంది రాజేశ్వరి చుట్టూ చూస్తూ.

ఆ గుడిసెలో చూడటానికి పెద్దగా ఏవీ లేవు. ఒక పక్క నించి మరో పక్కకు దండెం కట్టి ఉంది. దాని మీద అందరి బట్టలు కుప్పలా పడేసి ఉన్నాయి. గుడిసెకి ఓ మూల కొక్కేనికి లాంతరు వేలాడుతోంది. కింద మట్టితో పొయ్యి కట్టి ఉంది. దాన్లో ఆరిపోయిన చితుకులు, దాని పైన ఓ పాత మట్టి కుండ ఉంది. కుండ మీద మూత లేదు. ఈగలు ముసురుతున్నాయి. మరో పక్క మంచినీళ్ళకి కాబోలు, తాటాకు మట్టు మీద పెద్ద మట్టి బాన పెట్టి ఉంది. దాని మీదో సత్తు మూత, సత్తు గ్లాసు ఉన్నాయి. పొయ్యి చుట్టూరా ఉన్న సత్తు బొచ్చెలు, మట్టి ముంతలు తప్ప అక్కడ ఇంకేమీ లేవు.

పాకలో సరిగ్గా మధ్యకి తాటాకులతోనే సగం వరకు అడ్డుగోడలా కట్టి ఉంది. అవతల కట్టిన మరో దండెం మీద రెండు పాత దుప్పట్లు వేలాడుతూ కనిపిస్తున్నాయి. గుడిసెలో ఎటు చూసినా బూజులు వేలాడుతున్నాయి. వండిన గుడ్ల పెంకులు కాబోలు పొయ్యికి ఓ వైపున పడి ఉన్నాయి. గుడిసెకి ఓ మూల తూము ఉంది. దాని చుట్టూ తడిగా, బురదగా ఉంది

గుడిసెకి వెనుక పెద్ద స్థలం, ముందు కొంచెం స్థలం ఉన్నాయి. ఒకటే గదిలా వేసుకున్నారు పాకని. స్థలం చుట్టూ హద్దుగా ముళ్ళ కంచె వేసి ఉంటుంది మూగ జీవాలేవీ లోపలకు రాకుండా. కొడుకులు ఇద్దరూ వెనుక దొడ్లో, మొగుడు పెళ్ళాలు పాకలో పడుకుంటారు రోజూ. మరి ఇప్పుడెలా? కోడలు, అందునా పెద్దింటి అమ్మాయి వచ్చింది కదా. బుర్ర గోక్కున్నాడు శ్రీనివాసులు. కొడుకు లిద్దర్నీ కేకేసాడు.

"ఓ పాలిటు రాండి రా. తాటితోపు కాడి కెళ్ళే పని బడింది. కూసంత సాయం గావాలి."

మధ్యాహ్నం భోజనాల వేళ్టికల్లా తమ ఇంటికి కాస్త ఎడముంచి వెనుక వైపు విశాలంగా ఒక పాక వేసాడు శ్రీనివాసులు. కొడుకులిద్దరి సహాయంతో. అందులోనే మధ్యలో తాటాకులనే అడ్డుగోడగా కట్టి పడకకి రెండో గది ఏర్పాటు చేసాడు.

ఈ లోగా అలిమేలు కొత్త కుండలో ఎసరు పెట్టింది. రాజేశ్వరి చేత అందులో మూడు గుప్పిళ్ళ బియ్యం వేయించింది. అన్నమ్మకి దణ్ణం పెట్టుకోమంది,"కూటి కుండ ఎప్పటికీ నిండుగా ఉండాలని!" మనస్ఫూర్తిగా దణ్ణం పెట్టుకుంది రాజేశ్వరి. ఆచారాలు అర్థం చేసుకుంటే ఎంత ఆనందాన్నిస్తాయో! తన తరువాత ఇంటిని నిర్వహించాల్సిన కోడలిచేత ఇంట్లో ఎట్టి పరిస్థితులలోనూ అన్నానికి లోటుండకూడదని అన్నపూర్ణా దేవికి దణ్ణం పెట్టించటం ఎంత గొప్ప ఆచారం!

రాజేశ్వరి తమకోసం మామగారు, భర్త, మరిది తయారు చేసిన ఆ కొత్తపాక లోపలకు వెళ్ళి అబ్బురంగా చూస్తోంది. ఆమె కళ్ళకి అది తనకోసం అత్తింటివారు కాను కిచ్చిన ప్రేమసౌధం లా కనిపించి మనసు నిండిపోయింది. పాకలోకి అడుగు పెట్టేప్పుడు

"ఈ ఇల్లు పదిళ్ల మొదలవ్వాలి" అనుకుంది మనసులో. అహంకారంతో నిండిన ఆమె మనసులో అత్తమామల మీద ఆప్యాయత అంకురించింది ఆ క్షణం.

"ఈ ఇంటిని, కాదు కాదు, ఈ వాడనే మార్చి అమ్మకు చూపించాలి. వీళ్ళందరికీ మంచి, చెడు చెప్పి బ్రతుకులలో మార్పు తెచ్చి రాజేశ్వరి అంటే ఏమిటో కనీసం పుట్టింటి వారి ముందు నిరూపించుకోవాలి" అనుకుంది. ఏ  కారణాన తీసుకుంటే ఏమి? సంకల్పమైతే మంచిదే కదా!...

ఇవతల అలిమేలుకి కోడలికి అన్నంలోకి ఏమి ఏమి వేసి పెట్టాలో తెలియట్లేదు. కొద్దిసేపు ఆలోచించింది. ఏదీ తేలలేదు. చివరకు కొడుకు దగ్గరకు పోయి అడిగింది. నాగరాజుకు మటుకు ఏమి తెలుసు? తెల్ల మొహం వేసాడు. అందునా రాజేశ్వరి పూర్తిగా శాకాహారి.

"ఉండవే చెప్తాను" అని రాజేశ్వరి దగ్గిరకు వెళ్ళాడు. కొత్త గుడిసె లో కూర్చుని తన పెట్టె తెరవబోతూ ఉంది రాజేశ్వరి. అలా నేలమీద కూర్చున్న ఆమెను చూసి అతనికి ఏదో చెప్పలేని సున్నితమైన భావం కలిగింది. అకాశంలో జాబిల్లి భూమి పైకి వచ్చిందా! పెళ్ళై ఇంటికి వచ్చాక వాళ్ళిద్దరూ మాట్లాడుకున్నదే లేదు.

“రాజేశ్వరి, నువ్వు అన్నంలోకి ఏమి తింటావని అమ్మ అడగమంది." నాగరాజు తన దగ్గరకి రాగానే కూర్చుని ఉన్న రాజేశ్వరి గబుక్కున లేచి నిల్చుంది. ఈ మర్యాద నాగరాజు ఎక్కడా చూడనిది, తమ ఇళ్లల్లో ఎవ్వరూ ఎవరికీ ఇవ్వనిది. రాజేశ్వరి తనకోసం ప్రత్యేకంగా ఏమి వండాలి అని అత్తగారు అడుగుతున్న దనుకుంది. "నాకోసం ఏమీ వండక్కరలేదు. మీరేం తింటే నేనూ అదే" అంది అమాయకంగా

నాగరాజు నవ్వేసాడు. "కోడిగుడ్ల ఇగురు మరి. ఇష్టమేనా?"అన్నాడు. అప్పుడు రాజేశ్వరికి అర్థం అయ్యింది అతను ఎందుకు అడిగాడో.

"అయ్యో, నేను గుడ్లు తిననుగా" అంది.

“ఏం వండమంటావు మరి?" రాజేశ్వరికి ఏం చెప్పాలో తోచలేదు.

"ఏదన్నా కూరగాయ? పప్పు?"

"అలాటివి ఉండవే ఇక్కడ" నిస్సహాయంగా అన్నాడు నాగరాజు. ఇద్దరికీ మొదటి సారి తమ మధ్య ఆహారపు అలవాట్ల నుంచి ఎంత తేడా ఉన్నదో స్పష్టంగా అర్థమయ్యింది. రాజేశ్వరి ఇక్కడ ఇమడగలదా అన్న సందేహం నాగరాజు కొచ్చింది. తన మీద తనకే కోపం వచ్చింది నాగరాజుకు. అంత పెద్దింట్లో బ్రతికిన రాకుమారిని ఇలా గుడిసెలోకి తెచ్చి పడేసినందుకు.

ఒక్కటైతే ఒప్పుకోవాలి. తనను అంత ప్రేమించి తన కోసం అంత మంచి ఇంటిని, ఐశ్వర్యాన్ని వదిలేసి వచ్చింది అంటే రాజేశ్వరికి తనంటే ఎంత ప్రేమ, నమ్మకం ఉండి ఉండాలి? మొదటి సారిగా రాజేశ్వరి అంటే అతని మనసులో ఎంతో ప్రేమా, జాలికూడా స్థిరంగా ఏర్పడ్డాయి. ఆమె కోసం ఏమన్నా సరే, ఎంత కష్టమైన పనన్నా చెయ్యాలి అనే ఆరాటం అతనిలో చోటు చేసుకుంది.

రాజేశ్వరికి పరిస్థితి అర్థమయ్యింది." పోనీ, గొల్ల సుబ్బమ్మ వాళ్ళింటికి వెళ్ళి పెరుగుంటే తీసుకు రండి." అంది. ఆ పెరుగు తినటమూ ఆశ్చర్యమే నాగరాజుకు. కానీ ఎదురు చెప్పకుండా 'అలాగే' అని వెళ్ళి పోయాడు.

బయటకు వెళ్లబోతుంటే అలిమేలు అతన్ని పిలిచింది." ఒరే, అమ్మాయిగారు కొత్త పాకలోనే కూసుంటారు గదా. ఆమెగారి ముందు గుడ్లు వండాలంటే ఏదోగా ఉంటది." నాగరాజుకు ఒక్కో సమస్యా అర్థమవుతోంది. అవును...తమ ఆహారం, రాజేశ్వరి ఆహారం పూర్తిగా వేరు. ఒక్కసారి నిట్టూర్చాడు నాగరాజు. తన పెళ్ళితో తల్లికి ఊహించని కష్టాలు! రాజేశ్వరి వచ్చిన దగ్గర నించి, తల్లి ఊపిరాడనట్లు ఉండటం అతను గమనిస్తూనే ఉన్నాడు. అంతస్థుల తారతమ్యం ఆమెను ఊపిరి తీసుకో నివ్వటం లేదు. తల్లిని చూసి అతనికి జాలి ముంచుకొచ్చింది. ఉంటుందన్నట్లు తల ఆడిస్తూ బయటకి నడిచాడు

జీవితం ఒక వారం రోజులలో ఇన్ని మలుపులు తిరగగలదని ఎవరన్నా చెప్తే రాజేశ్వరి నవ్వేసేది. కానీ ఇప్పుడు తన జీవితమే ఇలా అనుకోని మలుపులు తిరిగింది. ఒక్క సారి ఈ మధ్య తన జీవితంలో త్వరత్వరగా చోటు చేసుకున్న మార్పులు ఆమె కనుల ముందు మెదిలాయి.

తన అన్న, తమ్ముడు, మావయ్యలు అతన్ని కొట్టటంతో అందరిముందు తను నాగరాజును పెళ్ళి చేసుకుంటానని చెప్పటం. తండ్రి సంకట స్థితి, ఆయన, తల్లి అయిష్టతతో తనను నాగరాజుకు ఇచ్చి కట్టబెట్టటానికి పడిన సంఘర్షణ, ఆయనను ఆ బాధ నుంచి తప్పించటానికి తను నాగరాజును ఎవరికీ చెప్పకుండా పెళ్ళి చేసుకోవటం, తనలా ఎందుకు పెళ్ళి చేసుకుందో తండ్రి అర్థం చేసుకుని తనని ఆశీర్వదించటం, తనని అత్తవారింట్లో అమ్మా నాన్న దింపటం, ఈ ఇంటిని చూసిన తల్లి కళ్ళల్లో ఏహ్యాభావం అన్నీ ఆమె కళ్ళ ముందు దృశ్యాల్లా కదలి... పోయాయి.

ఇప్పుడు మావగారు తన కోసం విడిగా ఈ పాక వేయటం, తమకు ఏకాంతం కల్పించాలనే అత్తమామల తాపత్రయం రాజేశ్వరి మనసును కదిల్చివేశాయి. తన తండ్రి తమ పెళ్ళిని ఆమోదించినట్లుగా, తల్లి ఆమోదించలేదు. కానీ అత్తమామలు మటుకు తమని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. ఆర్థికంగా తమ తల్లిదండ్రులు ఉన్నతులు కావచ్చు, కానీ గుణాల్లో అత్తమామలు వారికేమీ తీసిపోరు. ఇప్పుడు వాళ్లకి వాళ్ళ కొడుకుతో పాటు పోషించటానికి మరో ప్రాణి తోడయ్యింది. కానీ వారి మొహాల్లో కానీ, ప్రవర్తనలో కానీ ఆదో సమస్యగా భావిస్తున్న సూచనలు లేవు.

"జీవితం పాఠాలను నేర్పుతుంది. చక్కగా నేర్చుకుని బ్రతుకు పండించుకుంటామో, కఠిన పరీక్షలకు నిలవలేక పిందెలుగానే రాలిపోతామో మన చేతుల్లోనే ఉంది." ఒక సందర్భంగా తండ్రి చెప్పిన పాఠం రాజేశ్వరికి గుర్తొచ్చింది.

ముందున్న గుడిసె దగ్గరకు వెళ్ళి "అత్తయ్యా" అంటూ లోపలికి వెళ్ళబోయింది. ఒక్కసారిగా కంగారు పడింది అలిమేలు..

"మీరాడనే ఉండండి అమ్మాయిగోరూ. నేనొత్తుండా," అంటూ గబుక్కున లేచి చేతులు కడుక్కుని ఇంటి ముందు కొచ్చేసింది. రాజేశ్వరికి కొంచెం చిత్రమనిపించింది.

"ఏం చేస్తున్నా రత్తయ్యా? అంది

"కోడిగుడ్ల కూరమ్మీ. మీరు తినరులే" అంది ఆమె కొంచెం సిగ్గుగా. రాజేశ్వరికి అర్థమయ్యింది.

"చీపురు కోసం వచ్చాను , వెనక పాక తుడుద్దామని "అంది సంజాయిషీగా.

"మీరు పదండి, నేను వత్తుండా." చేస్తున్న పని వదిలి చీపురు కట్ట పట్టుకొచ్చి వెనక పాక అంత శుభ్రం చేసింది అలిమేలు. అంతే కాదు తమ గుడిసె నుంచి చాప తెచ్చి వేసి, రాజేశ్వరిని కూర్చోమని, కొత్త గుడిసె అంతా అలికి ముగ్గులు పెట్టింది. ఓమూల పొయ్యి కట్టింది. చిన్న కొడుకు రామరాజుని పిలిపించి గుడిసెలో ఉట్లు కట్టించింది. తనకి చాతనైనంతలో ఆ ఇల్లుని కొత్త జంట ఉండేదుకు వీలుగా తయారు చేసింది. వెనకాల తాటాకులతో స్నానం చేసేందుకు వీలుగా ఒక స్నానాలగది కట్టించింది చిన్నకొడుకుతో. ఇవన్నీ రాజేశ్వరిని కూర్చోబెట్టి తనే చేసింది. ఈ పనులు జరుగుతుండగానే నాగరాజు వెనక్కి వచ్చాడు పెరుగు తీసుకుని. తనూ ఓ చెయ్యేసాడు పనులలో.

వీధి చివరున్న సర్కారువారి బావి నించి నీళ్లు తెచ్చి దొడ్లో ఉన్న తొట్టిలో అన్నదమ్ములిద్దరూ కలిసి నీళ్లు నింపారు. నాగరాజు ఆ తొట్టిలో నీళ్ళే ఓ సత్తుతపేలాతో చిన్న పాత తువ్వాలు కట్టుకుని, నాలుగు చెంబులు వొంటి మీద పోసుకున్నాడు.

"కూడు తిందురుగాని రండిరో!" తల్లి కేక విని కొడుకు లిద్దరూ పాకలోపలికి వెళ్ళారు. శ్రీనివాసులు అప్పటికే ఈసురోమంటూ గుడిసెలో కూర్చుని వున్నాడు. వండిన అన్నంలో కోడిగుడ్ల పులుసేసి ముగ్గురి ముందూ తలో సత్తు బొచ్చెలో పెట్టింది అలిమేలు. రాజేశ్వరికి ఎందులో పెట్టాలో తెలీలేదామెకు. అటూ, ఇటూ చూసింది కానీ మరో కంచం కూడా లేదు.

"అమ్మాయిగారు ఎందులో తింటారురా?" అంది కొంచెం అనుమానంగా. రాజేశ్వరి తను వచ్చేప్పుడు తల్లి ఇచ్చిన ఇనుప పెట్టె తెరిచింది. అందులో ఆమెకు, అల్లుడికి అని వెండి కంచాలు పెట్టింది హైమవతి. అవి చూడగానే కళ్ళ వెంట నీళ్లు తిరిగాయి రాజేశ్వరికి తల్లి గుర్తొచ్చి.

వాళ్ళు మట్టి మూకుళ్లలో తింటుంటే, తను వెండి కంచంలో ఎలా తినగలదు? అక్కడ నించి లేచి బయటకు వచ్చింది రాజేశ్వరి, "మీరు కానీండి అత్తయ్యా, నేను తరువాత తింటాను." అంటూ.

పది నిమిషాల్లో తినటం ముగించి నోరు పుక్కిలించి, రాజేశ్వరికి కొత్త వెండి కంచంలో పెరుగన్నం కలిపి తీసుకు వచ్చాడు నాగరాజు. తమ పాక వైపుకి ఆమెను తీసుకు వెళ్ళాడు. అక్కడున్న రాయి మీద కూర్చుంది రాజేశ్వరి. ఆమెకు నోట్లో ముద్దలు

అనురాగంగా పెట్టాడు నాగరాజు. నిత్యం శారద, హైమవతి బ్రతిమాలి పెట్టే గోరు ముద్దలు గుర్తు వచ్చాయి రాజేశ్వరికి. కళ్ళవెంట నీళ్లు తిరిగాయి.

భోజనం పూర్తి అయ్యాక రాజేశ్వరి కాళ్ళు చేతులు శుభ్రంగా కడుక్కుంది. కంచాన్ని కడిగి వేసింది. నాగరాజు ఈ లోగా ఆమె పెట్టెల్ని కొత్త పాక లోకి తెచ్చిపెట్టాడు. ఇద్దరూ ఆ పెట్టెలోని వస్తువులని చూసారు. రాజేశ్వరి బట్టలు, నగలు, ఆమె పెళ్ళికి కానుకగా వచ్చిన వస్తువులు అందులో ఉన్నాయి. మరో పెట్టె తెచ్చాడు రామరాజు ముందు పాకలోంచి. అందులో ఆమె వాడుక బట్టలు, అలంకార వస్తువులు ఉన్నాయి. ఇంకా మూడు బుట్టలు పైన బట్ట కట్టినవి ఉన్నాయి. అవి తెరిస్తే అందులో జంతికలు, మినపసున్ని, లడ్లు, చక్రాలు, చలిమిడి వంటి పదార్థాలు ఉన్నాయి. ఇంకో చిన్న పెట్టెలో ఆమె అత్తగారికి, మామగారికి, మరిదికి బట్టలు ఉన్నాయి. నాగరాజుకి పెళ్ళికి ఇవ్వడానికి కుట్టించిన బట్టలు, ఉంగరం, గొలుసు వంటివన్నీ భద్రంగా మరో పెట్టెలో ఉన్నాయి రాజేశ్వరి వాటితోపాటు ఉన్న ముఖమల్ సంచిని తెరిచి చూసింది. అందులో కొంత నగదు ఉంది. లెక్కించింది రాజేశ్వరి. అక్షరాలా ఐదు వేల రూపాయలు. రాజేశ్వరికి ఏడుపు ఆగలేదు. ఆమె ఏడవటం చూసి నాగరాజు నిస్సహాయంగా తల విదిల్చాడు.

"రాజేశ్వరీ, ఎందుకా కళ్ళనీళ్ళు? నన్ను పెళ్ళాడినందుకైతే కాదు కదా?" అతని స్వరంలో అనుమానంతో కూడిన భయం. తల అడ్డంగా తిప్పింది రాజేశ్వరి.

"ఇంతవరకు మన భవిష్యత్తు గురించి మాట్లాడుకునే అవకాశం మనకు రాలేదు. నేను ఏమీ పెద్దగా చదువుకోలేదు. నువ్వా డిగ్రీ చదివావు. నన్ను చేసుకుని తప్పు చేశానన్న బాధ ఇప్పటికే నీ మనసులో మొదలై ఉంటే నేనేమీ చెయ్యలేను. ఒక్క మాట. నన్ను చేసుకుని నీ స్థాయి దిగి ఉండొచ్చు. కానీ నువ్వు నన్ను పెళ్ళి చేసుకోవటం వలన నా స్థాయి అమాంతంగా పెరిగింది. పేటలో అందరు నన్ను ఎంతో గౌరవిస్తున్నారు. అంతే కాదు, 'ఏరా, ఒరేయ్' అని పిలిచే అయ్యగారు నన్ను 'అల్లుడుగారు' అని మన్నిస్తున్నారు. భారతి నన్ను 'బావా' అంటోంది. నన్ను కొట్టిన మీ అన్నలు, మావయ్యలు నన్ను గౌరవిస్తున్నారు. నాకు తెలుసు ఇదంతా నీ వల్లే జరిగింది."

రాజేశ్వరి భర్త మాటలను వింటోంది.

"నీ వెంటపడ్డప్పుడు, ఆలా ఎందుకు చేసానో నాకే తెలియదు రాజేశ్వరి. నువ్వు నన్ను పెళ్ళి చేసుకుందాం అని అడిగేటప్పటికీ కూడా నాకా ఊహ లేదు. నిజానికి మీ వాళ్ళు నన్ను కొట్టినప్పుడు వాళ్ళ మీద కసితో నిన్ను పెళ్ళి చేసుకుందాం అనుకున్నానేమో కానీ, నీ మీద ప్రేమతో కాదు. కానీ మీ నాన్న ఎదురుగా నువ్వు నిలబడి నన్ను ప్రేమించానని, పెళ్ళి చేసుకుంటానని చెప్పావే, ఆ ధైర్యానికి నేను దాసుడినయి పోయాను. ఆ క్షణం నుంచీ నిన్ను ప్రేమిస్తున్నాను. అప్పుడే నిర్ణయించుకున్నాను. జీవితాంతం నువ్వేం చెప్తే అది చేసినా నీ ఋణం తీరదని. తెలిసీ తెలియని వయసులో నేను చేసిన పిచ్చి పనికి, ఇంత మంచిపెళ్ళానివి, నువ్వొచ్చావు. నువ్వు నాకు వరానివి. నేను నీకు శాపంగా మటుకు మారను రాజేశ్వరీ" నాగరాజు కళ్ళు ఆ వెన్నెలలో, రాజేశ్వరి మీద ప్రేమతో మెరుస్తున్నాయి.

"మీ నాన్న, నువ్వు మన ప్రేమమాట చెప్పగానే నన్ను మనుషులతో కొట్టిస్తాడనుకున్నాను. పై కులాల వాళ్ళల్లో పెద్ద మనసులు ఉండవని నా నమ్మకం. నీతులు చెప్పేందుకే తప్ప ఆచరించేందుకు కావని నా నమ్మకం. కానీ ఆయన మనపెళ్ళికి ఒప్పుకున్నాడు. ముహుర్తాలు పెట్టించాడు. ఆయన మీద నాకు కలిగిన గౌరవం ఏమి చెప్పేది? ఎప్పటికీ ఆయనకు తలవంపులు తెచ్చే పని చెయ్యను. నా చర్మం ఒలిచి ఆయనకు చెప్పులుగా కుట్టించమన్నా కుట్టిస్తాను." ఆవేశంతో నాగరాజు మొహం ఎర్రబడింది.

రాజేశ్వరి అతని మాటలలోని నిజాయితీని గమనిస్తోంది. ఈ మాటలన్నీ మాట్లాడేటప్పుడు కూడా నాగరాజు రాజేశ్వరిని తాకలేదు. ఆమె ఎక్కువ, తను తక్కువ అన్న భావం అతని ప్రవర్తనలో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. రాజేశ్వరి అదీ గమనించింది. మాట్లాడుతున్న నాగరాజు వంకే చూస్తోందామె.

"ఇక మా అమ్మా నాన్నలు, నా చుట్టపక్కాలు అంతా మోటు మనుషులు. చదువుకోలేదు. వాళ్ళకి శుచి, శుభ్రం తెలియదు. చాలామంది తాగుతారు. జూదం ఆడతారు. పెళ్ళాలని కొడతారు. ఇవేవీ తప్పు కావు మాలో. అందరూ చాలా మంచివాళ్ళు. నువ్వే గ్రహిస్తావు. నువ్వు ఇక్కడ బతక గలననుకుంటే సరే. లేకపోతే మనం నీకు నచ్చిన చోటకి వెళ్ళి బ్రతుకుదాం."

పెళ్ళి అయ్యాక మొదటి సారి అప్రయత్నంగా నాగరాజుని స్పృశిస్తూ అతని నోరు తన వేళ్ళతో సున్నితంగా మూసింది రాజేశ్వరి. ఉద్వేగానికి గురైన నాగరాజు ఆమె చేతిని తన చేతులతో పట్టుకున్నాడు. అతని మంచితనం ఆమె మనసును జయించింది.

"రాజా, నిన్ను పెళ్ళి చేసుకుని నీ వెంట వచ్చింది నీతో పాటు కలిసి నీవాళ్ళతో ఉండటానికే కానీ, నిన్ను విడదీసి వేరే తీసుకు పోవటానికి కాదు. నేను నాకు చేతైనంత మారతాను. నువ్వూ నా కోసం మారు. ముందు మన ఇంటిని, మన వీధిని, మన వాడనీ మారుద్దాం. నువ్వు నాకు తోడుంటే అదేమంత కష్టం కాదు. ఈ ప్రయత్నంలో పెద్దలందరి సహకారం తీసుకుందాం. మన జీవితం ఆనందమయం, సార్థకం, చేసుకుందాం." నాగరాజు ఆమె కళ్ళల్లోకే చూస్తూ ఆమోదసూచకంగా తల ఊపాడు.

"రాజా, నేను నిన్ను ప్రేమించే పెళ్ళి చేసుకున్నాను. మొదటినించీ నువ్వంటే నాకు ఎంతో ప్రేమ. అయితే ముందే చెప్తున్నాను. నాకు కొంచెం కోపం, స్వార్థం ఎక్కువ. ఇంట్లో గారాబంగా పెరిగేసరికి కొంచెం మొండితనం ఉంది. దేన్నీ లెక్కచెయ్యను. కానీ రాజా, ఈ గుణాలన్నిటితోపాటు ప్రేమించే మనసుంది. ఒకసారి ఒక వ్యక్తిని ప్రేమిస్తే జీవితాంతం వాళ్ళకోసమేమైనా చేస్తాను. బహుశా ఆ మనసు వల్లనే నిన్ను పెళ్ళి చేసుకుంటే కష్టపడతానని తెలిసీ, నిన్ను వదులుకోలేక పోయాను. నేను నీ జీవితంలోకి ఇలా రావటం వలన నువ్వు సుఖపడతావో, కష్టపడతావో నాకు తెలియదు. నేను నిన్ను ఇబ్బంది పెడతానేమో అని భయంగా కూడా ఉంది. కానీ, ఒక్కటి మటుకు నమ్ము, నాకు నువ్వంటే ఎంతో ప్రేమ."

ఆమెను అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తున్నాడు నాగరాజు. ఆమె అలా తన గురించి, తన స్వభావం గురించి చెప్పుకోవటం అతనికి ఎంతో నచ్చింది.'రాజా!' అన్న ఆమె పిలుపు, ఆమె తనతో ప్రేమగా మాట్లాడే పద్ధతి, ఆమె చెప్పే విషయాలు అన్నీ నచ్చాయి నాగరాజుకు. అతని హృదయంలోంచి ఆమె మీద ప్రేమ పెల్లుబికింది.

"నేను నీకు తోడుగా నీడగా ఉంటాను రాణీ. నువ్వేం చేసినా నీకు నేనుంటాను" ఆవేశంగా అన్నాడు నాగరాజు. నిజంగా భార్య అభిప్రాయాలను అర్థం చేసుకుని, సహకరించే భర్త దొరకటం ఆడదాని అదృష్టం. కట్టుకున్న మగవాడిని తన కనుకూలంగా మార్చుకోవటం ఆడదాని చాతుర్యం.

అతని మాటల వలన కలిగిన సంతోషంతో అతన్ని హత్తుకు పోయింది రాజేశ్వరి.

"ఒరే నాగరాజూ, పెద్దబజార్లో పని ఉండాది గానీ ఓ పాలి పోయొద్దాం, రారా అయ్యా." బయట నించి శ్రీనివాసులు గొంతు వినటంతో ఉలిక్కిపడి నాగరాజుకు దూరంగా జరిగి పమిట భుజాల చుట్టూ కప్పుకుంది రాజేశ్వరి. కానీ శ్రీనివాసులు లోపలకు రాలేదు. బయటే నిల్చున్నాడు. నాగరాజు నవ్వుకుంటూ బయటకు వెళ్లబోతుంటే అతన్ని ఆపి, అతని చేతిలో రెండు వందలు పెట్టింది రాజేశ్వరి. ఎందుకని అడగబోయిన నాగరాజు అంతలోకే అర్థమైనట్లు బయటకు వెళ్ళిపోయాడు.

★★★★★

(తరువాయి వచ్చే సంచికలో)

COMMENTS